
www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 31 డిసెంబర్ 2024
5
తిరుపతి



కూల్చిన ఇళ్లు కట్టివ్వాలని గిరిజనుల ధర్నా


ప్రజాశక్తి - రేణిగుంట



చెంగారెడ్డిపల్లిలో కూల్చివేసిన ఇళ్లను కట్టి ఇవ్వాలని ఎపి గిరిజన సంఘం, ఏకలవ్య ఎరుకుల కాలనీ ఇళ్ల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం గ్రీవెన్స్‌సెల్ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. సంఘం ప్రధాన కార్యదర్శి హరినాథ్ మాట్లాడుతూ అక్రమ కూల్చివేతతో ఇళ్లు కోల్పోయిన 90 మందికి న్యాయం చేయాలన్నారు. అధికారుల చర్యతో ఎరుకుల కులస్తులు రోడ్డున పడ్డారన్నారు. బాధితులకు 3 సెంట్ల ఇంటిస్థలం ఇచ్చి, హౌసింగ్ ఇల్లు మంజూరు చేయాలని కోరారు. ఈ ధర్నాలో సిపిఎం నాయకులు వెంకటరమణ, శివానందం, సెల్వరాజ్, సత్యశ్రీ, ఈశ్వరమ్మ, చీరాలయ్య, రాధిక, రాజశేఖర్ పాల్గొన్నారు.

గగన విన్యాసాలకు నాంది

అంతరిక్షంలోకి 'స్పేడేక్స్' ఉపగ్రహాలు
పిఎస్‌ఎల్‌వి సి-60 విజయవంతం



ప్రజాశక్తి - సూళ్లూరుపేట

రెండు ఉపగ్రహాలు, 24 పేలోడ్లతో పిఎస్-ఎల్‌వి సి-60' విజయవంతంగా నింగికెగిసింది. శ్రీహరికోటలోని సతీష్‌ధావన్ అంతరిక్ష కేంద్రంలో స్వల్ప మార్పుతో 10 గంటల 15 సెకన్లకు బహుళ ప్రయోజనాల రాకెట్ దూసుకెళ్లింది.



చెంగాళమ్మ సేవలో ఇస్రో ఛైర్మన్

సూళ్లూరుపేటలో శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో ఇస్రో ఛైర్మన్ ఎస్. సోమనాథ్ పూజలు చేశారు. సోమవారం ఆలయం వద్ద సహాయక కమిషనర్ ప్రసన్న లక్ష్మి స్వాగతం పలికారు. సోమవారం రాత్రి షార్ నుండి జరిగే పిఎస్‌ఎల్వి సి-60 రాకెట్ ప్రయోగం విజయవంతం కావాలని అమ్మణ్ణి చెంత కోరుకున్నారు. ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ మాట్లాడుతూ షార్ నుండి సోమవారం 99వ రాకెట్ ప్రయోగం చేస్తున్నామని, ఈ ప్రయోగం విజయవంతం కావాలని అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నామని తెలిపారు. అంతరిక్షంలోకి వెళ్లే స్పేడెక్స్ ఉపగ్రహాల ద్వారా వారం రోజుల తరువాత నుండి పరిశోధనలు ప్రారంభించడం జరుగుతుందని, ఒక సారి కానీ అంతకు మించి కానీ అవసరాలకు అనుగుణంగా రెండు మిషన్లను అనుసంధాన ప్రక్రియ జరుగుతుందని తెలియజేసారు. 2025 లో మొదటగా పిఎస్‌ఎల్వి రాకెట్ ద్వారా ఎన్‌విఎస్ 02 ఉపగ్రహ ప్రయోగం ఉంటుందని, అలాగే జిఎస్‌ఎల్వి మార్క్ 3 ప్రయోగాలు ఉంటాయనితెలిపారు. ఛైర్మన్ తో పాటు గ్రూప్ మేనేజర్ గోపికృష్ణ ఉన్నారు.

అమిత్‌షా రాజీనామా చేయాలి



గూడూరులో..

వామపక్షాల నిరసన హోరు



తిరుపతిలో..

ప్రజాశక్తి - తిరుపతి టౌన్, యంత్రాంగం

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌పై రాజ్యసభలో అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో జిల్లావ్యాప్తంగా వామపక్షల నిరసన హోరెత్తింది. సిపిఎం, సిపిఐ, సిపిఐ(ఎంఎల్), న్యూ డెమోక్రసీ, ఎస్‌యుసిఐ(సి) పార్టీల ఆధ్వర్యంలో తిరుపతి అంబేద్కర్ విగ్రహం ఎదుట జరిగిన నిరసనలో సిపిఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు, సిపిఐ జిల్లా నాయకులు రామానాయుడు, సిపిఐ (ఎంఎల్) జిల్లా కార్యదర్శి రాయపనేని హరికృష్ణ మాట్లాడుతూ బిజెపికి భారత రాజ్యాంగం పట్ల, రూపొందించిన మేధావి అంబేద్కర్ పట్ల ఏమాత్రం గౌరవం లేదన్నారు. భారతదేశంలో కుల, మత, వర్గ, వర్ణ, ప్రాంతాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ విద్యా, వైద్యం, ఉద్యోగాలు, ఇతర హక్కులన్నీ సమానంగా అందించిన మహానుభావుడు అంబేద్కర్ అని కొనియాడారు. బడుగు, బలహీన వర్గాలు, మేధావులు, ప్రజాస్వామికవాదులు అంబేద్కర్ను మానవతావాదిగా, మహోన్నతుడిగా ఆరాధిస్తున్నారని చెప్పారు. మనుధర్మ శాస్త్రాన్ని నెత్తికెత్తుకున్న బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ పార్టీలు తమ రాజ్యాంగాన్ని దేశంలో అమలు చేయడానికి కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించారు. ఒకే దేశం, ఒకే చట్టం, ఒకే ఎన్నికలంటే తమ ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతాలను అమలు చేయడానికి సిద్ధమవుతున్న తీరు ప్రజలు గుర్తించాలన్నారు. దీని వెనుక దేశంలో ప్రజాస్వామ్యానికి, లౌకిక వాదానికి పెనుముప్పు పొంచి ఉందని చెప్పారు. ఈ దేశంలో మతోన్మాదుల ఆటలు సాగకపోవడానికి వామపక్ష పార్టీలు బలంగా ఉండటమే కారణమన్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ను అవమానించడం అంటే రాజ్యాంగాన్ని కూడా అవమానించడమే అన్నారు. రాజ్యాంగాన్ని గౌరవించలేని వ్యక్తి ఆ పదవిలో ఉండటానికి అనర్హులని, తక్షణం అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బిజెపి దేశంలో హిందు నినాదంతో ఏకపక్షంగా వ్యవహరిస్తూ మతోన్మాదాన్ని పెంచి పోషిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. బిజెపి మతోన్మాద చర్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి వెంకటరత్నం, లోకేష్, వెంకటసుబ్బయ్య, ముని కుమార్, వెంకటేష్, లక్ష్మి, నాయకులు రాధాకష్ణ, ఎన్డి రవి, జి బి సుబ్రహ్మణ్యం, బుజ్జి, మాధవ్ కష్ణ, వేణు, సాయి లక్ష్మి, హేమలత, హరీష్ పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అంబేద్కర్ పై అమిత్ షా వ్యాఖ్యలను కూటమి నేతలతో పాటు వైసీపీ నాయకులు ఎందుకు మాట్లాడటం లేదన్నారు. ఎన్నికల్లో ఓట్ల కోసం అంబేద్కర్ పేరును వాడుకునే టీడీపీ, జనసేన, వైసీపీలు పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్ కు అవమానం జరిగితే ఎందుకు మౌనం దాల్చారో చెప్పాలని సూటిగా ప్రశ్నించారు. భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలిచే అంబేద్కర్ రాజ్యాంగాన్ని హిందూత్వ రాజ్యాంగంగా మార్చేందుకు కుట్ర చేస్తున్న బీజేపీకి ఈ పార్టీలు పరోక్షంగా మద్దతిస్తున్నాయని మండిపడ్డారు. అమిత్ షా పై చర్యలు తీసుకునే వరకు అఖిలపక్ష పార్టీలు ఆందోళనల్లో పాలు పంచుకోవాలని పిలుపునిచ్చారు. సీపీఎం, సిపిఐ ప్రాంతీయ కార్యదర్శులు గంధం మణి, జనమాల గురవయ్య, పెనగడం గురవయ్య, వెలివేంద్రం, ఉస్మాన్ బాషా పాల్గొన్నారు. **సత్యవేడులో** జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దాసరి జనార్ధన్, సిపిఐ సత్యవేడు ఏరియా కార్యదర్శి చిన్నిరాజు ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మెలుగు రమేష్, మురళి, నాగార్జున, మురుగేష్ పాల్గొన్నారు. **కెవిబిపురంలో** సిపిఎం నాయకులు నాగలాపురం నాగరాజు ఆధ్వర్యంలో నిరసన జరిగింది. వెంకట ముని, మురగయ్య పోలయ్య, సుబ్రమణ్యం పాల్గొన్నారు. **పుత్తూరులో...** సిపిఎం డివిజన్ కార్యదర్శి ఆర్.వెంకటేష్, సిపిఐ పట్టణ కార్యదర్శి డి.మహేష్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అమిత్‌షా ఆ పదవికి అనర్హులన్నారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణారెడ్డి, విజయ్, బాషా, సుబ్రమణ్యంపిళ్లై పాల్గొన్నారు. **గూడూరు టౌన్‌లో..**సిపిఎం ఆర్గనైజర్ జోగి శివకుమార్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. నాయకులు శ్రీనివాసులు, వెంకట రామిరెడ్డి, సురేష్, అడపాల ప్రసాద్, బివి రమణయ్య, ప్రభాకర్, శశి, కాలేషా, చంద్రయ్య పాల్గొన్నారు.

పాకాలలో.. ఆర్టీసీ బస్టాండ్ వద్ద సిపిఎం మండల కార్యదర్శి ఇ.మధుసూదన్‌రావు, కెవిపిఎస్ కార్యదర్శి రవి, నాయకులు దొరస్వామి, గోపి, చలపతి, కేశవులు ఆధ్వర్యంలోనిరసన తెలిపారు.

'యువగళాని'దే అధికారం..!

పొలిటికల్ రౌండప్ 2024

'కూటమి'లో నామినేటెడ్ కలవరం
కలసికట్టుగా వామపక్ష ఉద్యమాలు



కుప్పంలో యువగళం ప్రారంభం (ఫైల్)

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

కూటమి 2024 ఎన్నికల్లో విజయదుందుభి మోగించింది. 2019 ఎన్నికల్లో చతికిలపడ్డ టిడిపి 'యువగళం' యాత్రతో విజయం దిశగా అడుగులు కుప్పం నుంచి వేసింది. తిరుపతి, చిత్తూరు ఉమ్మడి జిల్లాలో 2019లో కుప్పంలో నారా చంద్రబాబునాయుడు తప్ప మిగిలిన 13 నియోజకవర్గాల్లోనూ వైసిపి స్వీప్ చేసింది. ప్రస్తుతం 2024 ఎన్నికల్లో రివర్స్ అయ్యింది. 14 నియోజకవర్గాల్లోనూ ఒక్క పుంగనూరు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మినహాయించి, 13 నియోజకవర్గాల్లో టిడిపి కూటమి స్వీప్ చేసింది. తిరుపతి నియోజకవర్గంలో జనసేన తరపున ఆరణి శ్రీనివాసులు పోటీచేసి గెలుపొందారు. చిత్తూరు ఎంపి దుగ్గుమళ్ల ప్రసాద్ కాగా, తిరుపతికి వైసిపి ఎంపి మద్దిల గురుమూర్తి హవా కొనసాగింది. రెండు జిల్లాల్లోనూ అధికార పార్టీకి మంత్రి పదవులు వస్తాయని ఆశించారు. అయితే కుప్పం నుంచి గెలుపొందిన నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయ్యారు తప్ప, జిల్లాకు నామినేటెడ్ పదవుల్లో నిరాశే మిగిలింది.

వైసిపిలో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని జిల్లా అధ్యక్ష పదవి నుంచి తప్పిస్తూ అధినేత జగన్మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. చిత్తూరు, తిరుపతి ఉమ్మడి జిల్లా వైసిపి అధ్యక్షులుగా టిటిడి మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డిని ప్రకటించి అట్టహాసంగా ప్రమాణ స్వీకారం చేయించారు. అయితే అధికార పార్టీ దాడుల నుంచి కార్యకర్తలను కాపాడుకోవడంలో భూమన కరుణాకర్‌రెడ్డి ప్రయత్నించారే తప్ప, పార్టీ విస్తరణకు ప్రత్యేక శ్రద్ధ చూపలేదనే చెప్పాలి. ఇటు టిడిపి కూటమిలోనూ చిత్తూరు జిల్లా అధ్యక్షుని మార్పు చేశారు. సిఆర్ రాజన్ చిత్తూరు సీటు ఆశించడంతో ఆయనను బుజ్జగించి, అధికారంలోకి వస్తే వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్ చేస్తామని హామీ ఇచ్చి నెరవేర్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎన్నికల హామీల్లో భాగంగా ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల్లో కేవలం ఒకే ఒక్క సామాజిక పింఛన్లు తప్ప, మిగిలినవేవీ అమలు కాకపోవడం ప్రజల్లో అసంతృప్తి ఉంది. ఇక కాంగ్రెస్ విషయానికి వస్తే కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ ఆధ్వర్యంలో అడపాదడపా ఆందోళనలు మినహా చెప్పుకోదగిన స్థాయిలో ప్రతిపక్ష పాత్ర పోషించలేదు. ఈ కారణంగానే ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఆ పార్టీకి డిపాజిట్లను కూడా దక్కించుకోలేదనే చెప్పాలి.

బిజెపిని ఎండగడుతూ వామపక్షాల ఉద్యమాలు



సత్యవేడులో సిపిఎం మహాసభలు (ఫైల్)

అటు వైసిపి హయాంలోనూ, ఇటు కూటమి ప్రభుత్వంలోనూ ఉద్యమాలే ఊపిరిగా వామపక్షాలు ప్రధాన భూమిక పోషించాయి. ముఖ్యంగా సిపిఎం ఈ ఏడాదిలో అటు చిత్తూరులోనూ, ఇటు తిరుపతిలోనూ సిపిఎం జిల్లా మహాసభలను నిర్వహించింది. చిత్తూరు జిల్లా కన్వీనర్‌గా వాడ గంగరాజు, తిరుపతి సిపిఎం జిల్లా కార్యదర్శిగా వందవాసి నాగరాజు ఎన్నికయ్యారు. టిటిడి ఫారెస్టు కార్మికులు 1138 రోజుల పాటు రిలేదీక్ష కొనసాగి పోరాడి విజయం సాధించారు. టిటిడిలో పనిచేస్తున్న ఎఫ్‌ఎంఎస్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు 6వేల మందికి జీతాలు పెంచాలని 17 రోజుల పాటు నిరవధిక పోరాటం చేసి ఎన్నికల సమయంలో ఐదువేల రూపాయల వేతనాన్ని పెంచుకోగలిగారు. జానపద వృత్తికళాకారుల సంఘం బలోపేతానికి 'ఆలాపన' పేరుతో మహతి ఆడిటోరియంలో సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని శెట్టిపల్లి భూ సమస్య క్లైమాక్స్‌కు చేరుకుంది. మణిపూర్ మహిళలపైన, కార్మిక, రైతాంగ నల్లచట్టాలపైన, నిత్యవసర భారాలపైన ఉద్యమాలు నిర్వహించడమే గాకుండా, ప్రజలను చైతన్యవంతులను చేసే ప్రయత్నం చేశారు. రేణిగుంట మండలం ఎర్రగుట్ట వద్ద, కెవిబిపురం మండలం కొత్తూరు, సత్యవేడు మండలం పేరడ, తొట్టంబేడు మండలం కాంచనపల్లి, నాయుడుపేట మండలం ఎగువకాలూరు గిరిజన కాలనీ, వెంకటగిరి పెట్లూరు భూ సమస్యలపై, ఇళ్లస్థలాల కోసం పెద్దఎత్తున ఉద్యమాలు నడిచాయి. కూటమి హయాంలో అధికారంలోకి వచ్చిన వెంటనే తమ పార్టీవారిని నియమించుకునేందుకు శ్రీకాళహస్తి డివిజన్ పరిధిలో అంగన్‌వాడీ, ఆశా, స్కీం వర్కర్లను తొలగించాలని కుట్రపన్నారు. అయితే సిఐటియు ఆధ్వర్యంలో బాధితులకు అండగా నిలిచి పోరాడి విజయవంతం అయ్యారు. తిరుపతిలో కాషాయమూకలు హిందూ మతోన్మాదం పేరుతో నానాయాగీ చేసే ప్రయత్నాలను కౌలికవాదులంతా ఏకమై తిప్పికొట్టారు. ముఖ్యంగా 'సర్దుబాటు' ఛార్జీల పేరుతో అటు వైసిపి హయాంలోనూ, ఇటు కూటమి ప్రభుత్వం వేసిన భారాలపై అలుపెరుగని పోరాటాలు చేశారు. వైసిపి హయాంలో అంగన్‌వాడీ, సాక్షరభారత్, ఉపాధ్యాయులు, దళిత గిరిజనుల ప్రధాన డిమాండ్లపై ప్రజాసంఘాలు రాజీలేని పోరాటాలను నడిపాయి. బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈ ఏడాది చివరిలో బాలోత్సవం-3ని అట్టహాసంగా నిర్వహించి 8,500 మంది విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపింది.




బాలోత్సవం (ఫైల్)

నూతన సంవత్సర కానుకగా...
శెట్టిపల్లి లబ్ధిదారులకు 'పట్టాలు'

18 అంకణాలు ఇవ్వడానికి నిర్ణయం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఎట్టకేలకు దీర్ఘకాలిక పోరాటాల ఫలితంగా నూతన సంవత్సర కానుకగా శెట్టిపల్లి లబ్ధిదారులకు జనవరి నెలలో అందిస్తామని, ప్లాటుదారులకు 18 అంకణాలు ఇవ్వడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని కలెక్టర్ హామీ ఇచ్చారు. పెండింగ్‌లో ఉన్న సర్వే నంబర్లను తక్షణమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. సోమవారం శెట్టిపల్లిలో రెవెన్యూ సదస్సు జరిగింది. హాజరైన ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులుకు, కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్‌కు సిపిఎం, శెట్టిపల్లి ఇంటి స్థలాల సాధన కమిటీ ఆధ్వర్యంలో స్థలాల సమస్యను తక్షణం పరిష్కరించాలని, పెండింగ్ లేఔట్లను వెంటనే క్లియర్ చేయాలని నాయకులు జయచంద్ర, ఎం.నరేంద్ర, రాధాక్రిష్ణ, ఎండి శ్రీను, కృష్ణ విజ్ఞప్తి చేశారు. గత 15 ఏళ్లుగా దీర్ఘకాలికంగా ఉన్న సమస్యను రెవెన్యూ సదస్సులో అయినా పరిష్కరించాలని కోరారు. ల్యాండ్‌పూలింగ్ పేరుతో రైతులను, ప్లాటుదారులను ఒప్పించినా ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదన్నారు. ప్రభుత్వాల చుట్టూ తిరిగి తిరిగి చెప్పులు అరిగిపోతున్నాయన్నారు. అక్కడి స్థలాలు కొనడానికి అనేకమంది తమ పుస్తెలు అమ్మి, కాయకష్టం చేసిన కూలి డబ్బులతో కొనుక్కున్నారని చెప్పారు. కలెక్టర్ స్పందిస్తూ ప్లాటుదారులకు 18 అంకణాలు ఇవ్వడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, జనవరి చివరికల్లా లేఔట్లు వేసి పట్టాలను చేతికి ఇస్తామని హామీ ఇచ్చారు.



శెట్టిపల్లి రెవెన్యూ సదస్సులో..

స్వల్పంగా నేరాలు తగ్గినా...
పొంచివున్న సైబర్ ప్రమాదం

క్రైం రౌండప్ 2024

239 మందిపై గంజా షీట్స్ ఓపెన్

ప్రజాశక్తి - తిరుపతి సిటి



ఆధ్యాత్మిక, పర్యాటక నగరమైన తిరుపతిలో ఈ ఏడాది స్వల్పంగా నేరాలు తగ్గాయని ఎస్‌పి సుబ్బరాయులు 2024-25 ఏడాది క్రైం రివ్యూగా వెల్లడించారు. అయితే సైబర్ నేరాలు పెరగడం ఆందోళన కలిగించే అంశం. నూతన సంవత్సరంలో సైబర్ నేరాలు ఓ రకంగా పోలీసు విభాగానికి సవాల్‌గా మారనుంది.

తిరుపతి జిల్లాలో పుణ్యక్షేత్రాలు, షార్ శ్రీహరికోట, శ్రీసిటీ సెజ్, విశ్వ విద్యాలయాలు, ప్రముఖ ఆస్పత్రులు ఉన్నాయి. దీంతో జిల్లా నలుమూలల నుంచి జిల్లా కేంద్రమైన తిరుపతికి నిత్యం వేలాది మంది వచ్చి వెళుతుంటారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది క్రైమ్ రేటు స్వల్పంగా తగ్గిందని, సైబర్ క్రైమ్ మాత్రం పెరిగిందని పోలీసు లెక్కలు చెబుతున్నాయి. గత ఏడాదితో పోలిస్తే ఏడు శాతం మేర కేసులు తగ్గాయి. 2023లో ఎన్‌సిఆర్‌పి ద్వారా నమోదైన సైబర్ కేసుల్లో ఇప్పటివరకూ 2,44,60,014 రూపాయలను నేరగాళ్ళు దోచుకోగా, 80,08,392 రూపాయలను రికవరీ చేసి బాధితులకు రిఫండ్ చేశారు. 2024లో 12,89,28,136 రూపాయల నగదును దోచుకోగా, కేవలం 2,36,16,426 రూపాయలను రికవరీ చేసి బాధితులకు అందించారు. మొబైల్ హంట్ అప్లికేషన్ సేవల ద్వారా ఇప్పటి వరకు రూ.7,56,40,000 విలువ గల 4275 మొబైళ్లను రికవరీ చేసి బాధితులకు అందజేశారు. 2024 లో 13 మర్డర్ కేసులలో నిందితులకు జీవితకాలపు జైలు శిక్షతో పాటు జరిమానాలు పడేలా పోలీసులు వాళ్ళ సాక్ష్యాలతో రుజువు చేశారు. గంజాయి అక్రమ రవాణాను అరికట్టడానికి ఏఎస్పి ఆధ్వర్యంలో, ఒక సీఐ, ఒక హెడ్ కానిస్టేబుల్, 16 పీసీలతో గంజాయి టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేశారు. ఈ ఏడాది ఇప్పటివరకు 85 గంజాయి కేసులు నమోదుచేసి 872.307 కిలోల గంజాయి, 17 వాహనాలను స్వాధీనం చేసుకుని, 223 మంది నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. అలవాటు పడిన 239 మంది నేరస్తులపై గంజా షీట్స్‌ను ఓపెన్ చేశారు. జిల్లా వ్యాప్తంగా అక్రమ రవాణాలో పట్టుపడిన 36 లక్షల విలువైన మద్యం బాటిళ్లను వివిధ సైజుల్లో (క్వార్టర్, హాఫ్, ఫుల్) మొత్తం 27,568 మద్యం బాటిళ్లను రోడ్డు రోలర్ సాయంతో ధ్వంసం చేసారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా 882 ఫిర్యాదులు రాగా అందులో 762 ఫిర్యాదులను పరిష్కరించారు. తిరుపతి జిల్లా ప్రజల సౌకర్యార్థం పోలీసు శాఖ వెబ్‌సైట్ సేవలను ప్రారంభించింది. క్రైం రివ్యూ కార్యక్రమంలో టాస్క్ ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్, అధనపు ఎస్పీలు వెంకట్రావు, రవి మనోహరాచారి, నాగభూషణం, రామకష్ణ, ట్రైనీ ఐపియస్ బి.హేమంత్ పాల్గొన్నారు.

2023-2024లో క్రైం వివరాలు


	2023లో	2024లో
దేహ సంబంధం	933	921
ఆస్తి సంబంధం	993	983
రోడ్డు ప్రమాదాలు	1039	1015
సైబర్ నేరాలు	173	248
వైట్‌కాలర్ నేరాలు	336	312
ఐపిసి నేరాలు	2,651	2,217

పురాతన కట్టడాలకు సిమెంటు రాళ్లు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

చోళులు, పల్లవులు, యాదవులు, కాకతీయులు లాంటి రాజవంశీయులు నిర్మించిన ఆలయాలు రాష్ట్రంలోనే కాకుండా దేశ, ప్రపంచవ్యాప్తంగా ఉన్నాయి. ఆనాటి కట్టడాలకు ఎంతో వైవిధ్యం, ప్రాధాన్యత ఉన్నాయి. శిథిలమైన వాటిని చూసినా పవిత్రత ఉట్టి పడుతుంది. అయితే ఆలయాల నిర్వహణ చేస్తున్న దేవాదాయ శాఖ అధికారుల తీరు మాత్రం తీసికట్టుగా ఉంది. పురాణ ప్రసిద్ధి చెందిన శ్రీ కాళహస్తీశ్వర స్వామి దేవస్థానంలో నాల్గవ శతాబ్దం నుంచి 14వ శతాబ్దం వరకు పలు దశల్లో నిర్మాణాలు జరిగాయి. మొత్తం కాశిరాళ్ళతోనే నిర్మించారు. దేశవ్యాప్తంగానే కాకుండా ప్రపంచ వ్యాప్తంగానూ గుర్తింపు పొందింది. అటువంటి దేవస్థానంలో నాగరికత పేరుతో జరుగుతున్న నిర్మాణాలు భక్తులను అసంతృప్తికి గురి చేస్తున్నాయి. కాశి రాళ్లు, బొంతరాళ్లు, భారీ ఇటుకలతో ఆనాడు నిర్మాణాలు జరిగాయి. ఆధునిక కాలమైనా కొత్త నిర్మాణాలు చేసే వారు కూడా అదే సాంప్రదాయాన్ని పాటిస్తున్నారు. అయితే శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం వారు మాత్రం నాణ్యత తక్కువగా ఉండే సిమెంటు రాళ్ల నిర్మాణాలు చేపట్టడం ఆలయ భద్రతపై విమర్శలు వినిపిస్తున్నాయి.

'ప్రహరీ' నిర్మాణంతో భద్రతపై ఆందోళన



గత ప్రభుత్వంలోనే పునాది!


ఆలయంలో, ఆలయ ప్రాంగణాల్లో సిమెంట్ రాళ్ళతో నిర్మాణాలు చేపట్టే సంస్కృతి గత ప్రభుత్వంలోని పాలకమండలిలోనే పునాది పడింది. సిమెంట్ రాళ్లు తయారు చేసే వ్యక్తిని కాంట్రాక్టర్ గా పెట్టి పనులు చేయించి నిధులు పక్కదారి పట్టించారన్న విమర్శలు ఉన్నాయి. అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ అధికారులు ఇప్పుడు కూడా సిమెంటు రాళ్ల వాడకాన్ని చేపడుతున్నారు. 1516లో శ్రీకష్ణదేవరాయలు దక్షిణ భారతదేశ దిగ్విజయ యాత్ర పూర్తి చేసుకున్న సందర్భంగా శ్రీకాళహస్తిలో 135 అడుగుల ఎత్తైన రాజగోపురం నిర్మాణాన్ని చేయించారు. వివిధ కారణాల వల్ల అది 2010లో కూలిపోయింది. నవయుగ నిర్మాణ సంస్థ వారు పాత కట్టడం తరహాలో కొత్తగా గోపురాన్ని నిర్మించారు. ఆ గోపురం ప్రహరీ నిర్మాణానికి ప్రస్తుతం సిమెంట్ రాళ్లను వినియోగిస్తున్నారు. దీనిపై భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాశి రాళ్ళతో నిర్మించిన రాజ గోపురానికి సిమెంటు రాళ్ల ప్రహరీ నిర్మించడంపై అసంతప్తి వ్యక్తం అవుతోంది. ఏడాదికి 200 కోట్ల రూపాయల ఆదాయం కలిగిన ఆలయంలో సిమెంట్ రాళ్ల వాడకం గురించి అధికారులు ఆలోచించాల్సిన అవసరం ఉంది. గతంలో ఉండిన అధికారులు సిమెంటు రాళ్ల అంచనాతో టెండర్ పిలిచారని అందువల్ల ప్రహరీ నిర్మాణానికి వినియోగిస్తున్నామని ఈఈ మురళీ ధర్ రెడ్డి తెలిపారు. ఇకపై జరిగే పనులకు సిమెంటు రాళ్లను వినియోగించబోమని ఆయన స్పష్టం చేశారు.

ఉచిత గ్యాస్ డబ్బులకు
ఎన్నాళ్లు ఆగాలి..?

3 లక్షల మందికే జమ
లక్షమంది పైనే నిరీక్షణ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

'గ్యాస్ సిలిండర్ ఇంటికి తీసుకొచ్చిన మరుసటిరోజే 48 గంటల్లో ఉచిత అమౌంట్ డబ్బులు మీమీ అకౌంట్లలో జమ అవుతుంది' అనేది అధికారుల మాట.. అయితే ఇప్పటివరకూ కేవలం మూడు లక్షల మందికే డబ్బు జమకావడం గమనార్హం. ఇంకా లక్షమంది పైనే లబ్ధిదారులకు డబ్బు జమ కావాల్సి ఉంది. దీపావళికి అట్టహాసంగా ప్రారంభించిన ఉచిత గ్యాస్ పథకం డబ్బులు, ఉగాదికైనా అకౌంట్లలో వేస్తారా? అని లబ్ధిదారులు వాపోతున్నారు. డబ్బు జమ కాకపోవడంతో పౌరసరఫరాల శాఖ, గ్యాస్ ఏజెన్సీలు, బ్యాంకుల చుట్టూ మహిళలు తిరుగుతున్నారు. మార్చి 31 వరకూ మొదటి సిలిండర్, జులై 31 వరకూ రెండోది, నవంబర్ 30కి మూడో సిలిండర్‌ను లబ్ధిదారులు తీసుకోవాల్సి ఉంది. నామమాత్రంగానే నగదు జమ అవుతుండటం విమర్శలకు తావిస్తోంది.



కార్యాలయాల చుట్టూ లబ్ధిదారులు

లబ్ధిదారులకు గ్యాస్ నగదు జమ కాకపోవడంతో గ్యాస్ ఏజెన్సీలు, తహశీల్దార్, పౌరసరఫరాల శాఖ చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ఉచిత గ్యాస్ బుక్ చేసుకున్న లబ్ధిదారులు న గదు కోసం ఉగాది కోసం చూడాల్సిందేనా? అని నిరుత్సాహం వ్యక్తం చేస్తున్నారు. తిరుపతి జిల్లాలో 6లక్షల 3వేల రేషన్‌కార్డులు ఉన్నాయి. 4 లక్షల 92వేల 404 మంది గ్యాస్ కనెక్షన్లు కలిగి ఉన్నారు. దీపం పథకం కింద 4 లక్షల 7వేల మంది అర్హులు ఉన్నారు. తుది జాబితాలో 4 లక్షల 21వేల మందిగా అర్హులని తేల్చారు. ఇప్పటివరకూ 2 లక్షల 98వేల మందికి బ్యాంకులో డబ్బు జమ అయ్యింది. ఉచిత గ్యాస్ డబ్బులు ఎందుకు జమ కాలేదని పౌరసరఫరాల శాఖ అధికారులను అడిగితే కెవైసి చేసుకోకపోవడం వల్ల అని సమాధానం చెబుతున్నారు. ఫోన్ నంబర్ బ్యాంక్ అకౌంట్‌కు లింక్ కాకపోయినా ఉచిత గ్యాస్ రావడం కష్టమని పేర్కొంటున్నారు. డబ్బులు రానివారు 1967 నంబర్‌కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేస్తున్నా సమస్య పరిష్కారం కావడం లేదని తెలుస్తోంది. తిరుపతి కొర్లగుంట మారుతీనగర్‌కు చెందిన షేక్ నసీమా ఉచిత గ్యాస్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఆధార్ నంబర్ 264 706 741 012. దీపావళి పండుగ తరువాత దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఇంతవరకూ డబ్బు జమకాలేదు. ఉచిత గ్యాస్ డబ్బులు రాకపోవడం వల్ల రూ.850 పెట్టి గ్యాస్ సిలిండర్ కొనుక్కోవాల్సి వచ్చిందని ఆమె వాపోయారు.

ఉగాదిలోపు పడొచ్చు : శేషాచలం రాజు, డిఎస్‌ఒ

ఉచిత గ్యాస్ కోసం దరఖాస్తు చేసుకున్న వారి బ్యాంకులో డబ్బులు పడనివారు ఆందోళన చెందొద్దు. కెవైసి లోపం ఉన్న వారు వెంటనే చేయించుకోవాలి. బ్యాంక్ అకౌంట్‌కు ఫోన్ నంబర్ లింక్ అయి ఉండాలి. ఎవరైనా డబ్బులు పడనివారు ఫిర్యాదు చేస్తే సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. ఇపుడు పడకపోయినా ఉగాదికైనా వారి అకౌంట్లో డబ్బు జమ అవుతుంది. ఆందోళన వద్దు.

అందరూ సమయపాలన పాటించాలి : కమిషనర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

సచివాలయ కార్యదర్శులు, నగర పాలక సంస్థ అధికారులు అందరూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, ఖచ్చితంగా సమయపాలన పాటించాలని కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను, కార్యదర్శులను ఆదేశించారు. సోమవారం ఉదయం నగర పాలక సంస్థ కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. అభివద్ధి పనులపై అధికారులు దష్టి సారించాలని, వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అన్నారు. అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ ఉన్నారు.

దక్షిణ భారత సాంస్కృతిక ఛాంపియన్‌గా ఎస్‌వియు



ఛాంపియన్ షిప్ కప్‌ను స్వీకరిస్తున్న ఎస్‌వియూ జట్టు

ప్రజాశక్తి - క్యాంపస్ : చెన్నైలోని ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలో నిర్వహించిన దక్షిణ భారత విశ్వవిద్యాలయాల సాంస్కృతిక పోటీలో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయానికి ఓవరాల్ ఛాంపియన్ షిప్‌లభించింది. డిఎస్‌డబ్ల్యుసిఎ ఆధ్వర్యంలో వర్సిటీ, అనుబంధ కళాశాలల విద్యార్థినివిద్యార్థులు సాంస్కృతిక పోటీలలో ఘనమైన ప్రతిభ కనబరిచారు. ఈ పోటీలలో రెండింటిలో ప్రథమ స్థానం, మూడింటిలో ద్వితీయ స్థానం, మరో రెండింటిలో నాలుగవ స్థానం, మరో నాలుగింట్లో ఐదవ స్థానంలో నిలిచి ఓవరాల్ ఛాంపియన్ సాధించింది. ఇంతటి ప్రతిభ కనబరిచిన విద్యార్థినివిద్యార్థులకు, టీమ్ మేనేజ్‌మెంట్ ఆచార్య మురళీధర్, కల్చరల్ కోఆర్డినేటర్ పత్తిపాటి వివేక్‌నూ వర్సిటీ ఉపకులపతి ఆచార్య అప్పారావు, రిజిస్ట్రారు ఆచార్య భూపతి నాయుడు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాదాపు నాలుగు నెలల నిరంతర శ్రమ ఫలితమే వర్సిటీ ఓవరాల్ ఛాంపియన్ అయిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో రాబోయే సంవత్సరం దక్షిణ భారత సాంస్కృతిక పోటీలను వర్సిటీలో నిర్వహించేందుకు ప్రయత్నిస్తామన్నారు.

నేడు ఏర్పేడులో ఆంక్షలు :సిఐ

ప్రజాశక్తి -ఏర్పేడు : నూతన సంవత్సర వేడుకల వేళ ఎస్‌పి సుబ్బరాయుడు ఆదేశాలు పాటించాలని ఏర్పేడు సీఐ జయచంద్ర పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండల ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ, వైన్ షాపులు నిర్దేశించిన సమయంలో మూసివేయాలని సూచించారు. డీజే సౌండ్స్, అశ్లీల నృత్యాలు, నిర్వహించేందుకు అనుమతులు లేవని చెప్పారు. వేడుకల పేరుతో బైక్, కార్ రేసింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

తవ్వకాలపై నిషేధం

ప్రజాశక్తి - ఓజిలి : మండల పరిధిలోని పెద్దపరియ జాతీయ రహదారి కూడలి వద్ద ఉన్న ఏజీ అండ్ పి గ్యాస్ నుండి అత్తివరం, నాయుడుపేట రహదారుల మీదుగా గ్యాస్ పైప్ లైన్ నిర్మాణ పనులు చేపడుతున్నామని దీనిపై అవగాహన లేని వ్యక్తులు గ్యాస్ పైప్ లైన్‌పై తవ్వకాలు చేపడుతున్నారని, అలా తవ్వితే గ్యాస్ లీక్ అయ్యి ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఉన్న కారణంగా తవ్వకాలపై నిషేధం విధించినట్లు ఏపీజీ యాజమాన్యం సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. పైపు లైన్లపై జెసిబిలతో, ఇతర యంత్రాలతో తవ్వకాలు చేపట్టే ముందు ఏజీఅండ్‌పీ గ్యాస్ యాజమాన్యానికి ముందు టోల్ ఫ్రీ నెంబర్ 1800 2022 999 ,7200108123 నెంబర్లకు సమాచారం తెలపాలని పేర్కొన్నారు. సమాచారం తెలపకుండా గ్యాస్ పైప్ లైన్‌పై తవ్వకాలు, మర్మతులు చేపట్టినా అలాంటి వారిపై ఏజీఅండ్‌పీ యాజమాన్యం చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు.

ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి జిల్లాలో ఎస్‌సి,ఎస్‌టి విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీని ఏర్పాటు చేయాలని శ్రీ బాలాజీ ఎస్సీ ఎస్టీ సంక్షేమ సమితి అధ్యక్షులు చెంగల్రాయలు కలెక్టర్ వెంకటేశ్వర్‌కు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సోమవారం వినతి పత్రం అందించారు. చిత్తూరు జిల్లాలో ఇప్పటికే డీవీఎంసీ కమిటీని ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. కలెక్టర్‌కు వినతి ఇచ్చిన వారిలో సమితి ఉపాధ్యక్షులు, జాయింట్ సెక్రటరీ గురవయ్య, సభ్యులు వెంకటేశులు, గురు శంకర్, రాంబాబు ఉన్నారు.

మంగళం ట్రెండ్స్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి నెహ్రూ మున్సిపల్ హై స్కూలు వేదికగా నిర్వహించిన బాలోత్సవం పిల్లల పండుగ పోటీలలో మంగళం ట్రెండ్స్ విద్యార్థులు ఏడు విభాగాలలో ఉత్తమ ప్రతిభ కనబరచి విజేతలుగా నిలిచారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేశవులు నాయుడు తెలిపారు. చెస్ సీనియర్ విభాగంలో లక్ష్మీనారాయణ, పదకేళి సీనియర్ విభాగంలో ప్రత్యూష, ఏకపాత్రాభినయం జూనియర్ విభాగంలో తనిష్క, పద్యం జూనియర్ విభాగంలో అక్షిత, మట్టి బొమ్మలు సీనియర్ విభాగంలో చైతన్యకుమార్, జానపద గేయాలు సోలో సీనియర్ విభాగంలో సిరి విజేతలుగా నిలిచి బహుమతులు అందుకున్నారన్నారు. విద్యార్థులకు మంచి శిక్షణ ఇచ్చి పాఠశాలకు మంచి గుర్తింపు ఇచ్చేలా చేసిన ఉపాధ్యాయులు రాధా మదన, మాధవి, లక్ష్మీకాంతమ్మ, డాక్టర్ నెమిలేటి కిట్టన్నను ప్రధానోపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

బాలురకు స్వెట్టర్ల అందజేత

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళంలోని ప్రభుత్వ బాలుర వసతి గృహంలో ఉన్న బాలురకు ప్రజా సాధికారిక ట్రస్ట్ వారు స్వెటర్లను పంపిణీ చేసినట్లు వసతి గృహం పర్యవేక్షణ అధికారి షణ్ముఖరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పిల్లలు మంచి సత్ప్రవర్తనతో సమాజంలో మంచి పౌరులుగా ఎదగాలని తిరుపతి జిల్లా బాలల న్యాయమండలి సభ్యులు నారాయణరెడ్డి, మంజుల కోరారు. ఫ్రూట్ మర్చంట్ శివయ్య, నరేష్, రాజేష్ వారి సహకారంతో ప్రభుత్వ బాలుర వసతి గృహం లో ఉన్న బాలురకు స్వెటర్లు అందివ్వడం జరిగిందని ట్రస్ట్ అధ్యక్షుడు బాలాజీ తెలిపారు. ఈ కార్యక్రమంలో శరత్ బాబు, ఐపిఓ లక్ష్మీపతి, ట్రస్ట్ సభ్యులు సురేష్ పాల్గొన్నారు.

హద్దు దాటితే కఠిన చర్యలు: ఎస్‌ఐ

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: నూతన సంవత్సర వేడుకల్లో హద్దు దాటితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ విశ్వనాథ నాయుడు హెచ్చరించారు. నూతన సంవత్సర వేడుకలకు పకడ్బందీ నిఘా వుంటుందని తెలిపారు. శ్రీ సిటీ మార్గంలో వందలాది దేశ విదేశీ పరిశ్రమలు ఉండడం అందులో వేలాది మంది కార్మికుల పనిచేస్తుండడం, పారిశ్రామిక వాడలో పలు గ్రామాలు ఉండడంతో వారందరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తుగా హెచ్చరిస్తామన్నారు. వేడుకలు ముసుగులో జూదం, బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించడం, వాహనాలు అతివేగంగా నడుపుతూ హారన్ చేస్తూ శబ్ద కాలుష్యంతో ఇతర సామాన్య ప్రజలను ఇబ్బంది, భయభ్రాంతులకు గురి చేయడం , అనుమతులు లేని వీధుల్లో బహిరంగ ప్రదేశాలలో అర్ధరాత్రి కేకులు కట్ చేసి కేరింతలు వేయడం, స్పీకర్లు పెట్టి విపరీతమైన సౌండ్ తో పాటలు పెట్టడం, పిల్లలు వాహనాలు నడపడం, డీజే అంటూ డాన్స్ లంటూ రికార్డింగ్ డాన్సులు పెట్టడం చేస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని, హెచ్చరించారు.

పుత్తూరు టౌన్: నూతన సంవత్సర వేడుకలు పేరుతో మద్యం సేవించి అల్లర్లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సోమవారం సీఐ సురేంద్ర నాయుడు హెచ్చరించారు. డి.ఎస్.పి రవికుమార్ ఆదేశాల మేరకు జనవరి ఒకటో తేదీ పట్టణం ,గ్రామాల్లో పోలీసు నిఘా ఉంటుందని తెలిపారు. మద్యం సేవించి స్పీడుగా బైక్ రైడింగ్ చేయడం, ఘర్షణలకు దిగడం వంటివి చేస్తే చర్యలు తప్పవన్నారు. వీధుల్లో గుంపులు గుంపులుగా తిరగరాదని సూచించారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా నూతన సంవత్సర వేడుకల్లో ప్రశాంతంగా చేసుకోవాలని సూచించారు.

కేంద్రమంత్రికి ఘన స్వాగతం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తిరుపతి పర్యటన సందర్భంగా సోమవారం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కి కస్తూర్బా కేంద్ర ట్రస్ట్ ఛైర్మన్, దిశా రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పిఆర్, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఎయిర్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా సభ్యులు డాక్టర్ పిసి రాయల్ ఘన స్వాగతం పలికారు. కేంద్ర మంత్రి తమిళనాడు పర్యటనలో భాగంగా రేణిగుంట విమానాశ్రయం చేరుకోవడంతో ఆయనకి పుష్పగుచ్ఛం అందించి దుశ్శాలువతో సత్కరించారు.

యుటిఎఫ్ డైరీ ఆవిష్కరించిన ఆర్‌జెడి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ 2025 సంవత్సరపు డైరీ, క్యాలెండర్లను సోమవారం కడప ఆర్జెడి కే. సామ్యూల్ ఆవిష్కరించారు. డిఈఓ ఆఫీస్ లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆర్జెడి డైరీ క్యాలెండర్లను ఆవిష్కరిస్తూ ఉపాధ్యాయుల సంక్షేమానికి యుటిఎఫ్ నిరంతరం కృషి చేస్తోందని, ఉపాధ్యాయుల సంక్షేమంతో పాటు విద్యారంగ అభివృద్ధికి, ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయడానికి యూటీఎఫ్ చేస్తున్న కృషిని అభినందించారు. జిల్లా విద్యాశాఖాధికారి కె వి ఎన్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేయాలని, బోధనలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని మేళవించి విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాలరెడ్డి, నాయకులు నిర్మల, దండు రామచంద్రయ్య, కుమారస్వామి, కె.మోహన్‌బాబు పాల్గొన్నారు.

ఉచిత కేన్సర్ స్క్రీనింగ్

ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి): స్విమ్స్, శ్రీ బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ ఆధ్వర్యంలో సోమవారం కొటాల పిహెచ్ సి వైద్యాధికారి డాక్టర్ జె ప్రియాంక పర్యవేక్షణలో కందుల వారిపల్లి సచివాలయం, భీమవరం పాత సచివాలయంలో ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొటాల పిహెచ్ సి వైద్యాధికారి డాక్టర్ జె ప్రియాంక మాట్లాడుతూ క్యాన్సర్ ను మొదటి దశలో గుర్తిస్తే తగిన చికిత్స అందించి పూర్తిగా నివారించవచ్చని తెలిపారు. 30 ఏళ్ళు దాటిన మహిళలందరూ తప్పనిసరిగా మామోగ్రామ్, పాప్ స్మియర్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. పొగాకు, గుట్కా, ఖైనీ లాంటి అలవాట్లకు దూరంగా ఉంటే నోటి క్యాన్సరును నివారించవచ్చన్నారు. పింక్ బస్సుల్లో మహిళలు, పురుషులకు బిపి, షుగర్ పరీక్షలతోపాటు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్ కోసం మామోగ్రామ్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ కోసం పాప్ స్మియర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు.

గడువులోపు అర్జీలు పరిష్కరించాలి: వెంకటేశ్వర్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 284 అర్జీలు వచ్చాయని, ప్రతి అర్జీకి గడువులోపు తగిన పరిష్కారం చూపాలని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుండి కలెక్టర్ వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డిఆర్‌ఓ నరసింహులు, వివిధ విభాగాల అధికారులు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. అత్యధికంగా రెవెన్యూ శాఖకు సంబంధించి 148 అర్జీలు సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్‌కు ప్రజలు వెనుక రూపంలో అందించారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

ట్రై సైకిల్ అందజేత

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఒక అర్జీదారునికి అప్పటికప్పుడే జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ ట్రై సైకిల్‌ను అందించారు. శ్రీకాళహస్తి మండలం ఎంపేడు గ్రామం, ఈశ్వరయ్య కాలనీకి చెందిన గబ్బా వెంకటేశ్వర రావు పుట్టుకతో విభిన్న ప్రతిభావంతుడని, నాలుగు చక్రాల బండిపై ఫ్లవర్ వాజ్ కుండీలను విక్రయించేవారని, తనకు మోటార్ సైకిల్ ఇప్పిస్తే ఎంతో ఉపయోగంగా ఉంటుందని తెలపడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ సహకారంతో వెంకటేశ్వరరావుకు ట్రై సైకిల్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల శాఖ పర్యవేక్షకులు వినోద్ పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి పోరాడుదాం: ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - సత్యవేడు: విద్యాభివృద్ధికి పోరాడాలని ఎస్ఎఫ్ఐ నాయకులు పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సత్యవేడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ సత్యవేడు ఇన్‌ఛార్జి మురళీ జెండాను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ1970లో ఏర్పడిన ఎస్ఎఫ్ఐ అనేక పోరాటాలు చేసిందని శాస్త్రీయ విద్యా విధానం కోసం అలుపెరుగని పోరాటం చేస్తోందన్నారు. సత్యవేడులో శ్రీ సిటీ వంటి పెద్ద పరిశ్రమలు వున్నా ఇక్కడి పేదల పిల్లలకు సరైన విద్యా సంస్థలు లేకపోవడం అన్యాయమన్నారు. సత్యవేడులో ప్రభుత్వ విద్యా రంగం అభివృద్ధికి భవిష్యత్తులో నమరశీల పోరాటాలు నిర్వహిస్తాం దన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ప్రభుత్వ జూనియర్ కళాశాల కమిటీ నాయకులు, విద్యార్థినివిద్యార్థులు పాల్గొన్నారు.



జెండాను ఎగురవేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సమస్యలు పరిష్కరించండి..

కలెక్టర్‌కు ఎమ్మెల్యే వినతి

ప్రజాశక్తి - పిచ్చా టూరు: సత్యవేడు నియోజకవర్గంలో వర్షానికి దెబ్బతిన్న రోడ్లు, వంతెనలకు వెంటనే మరమ్మతులు, పిచ్చాటూరు బీసీ బాలికల హాస్టల్‌కు రోడ్డు, దుప్పట్లు పంపిణీ చేయాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కలెక్టర్ వెంకటేశ్వర్‌కు విజ్ఞప్తి చేశారు. కలెక్టర్, జేసీలను ఎమ్మెల్యే సోమవారం కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సత్యవేడు నియోజకవర్గ సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాజాగా కురిసిన భారీ వర్షాలకు నియోజక వర్గంలోని వంతెనలు, రోడ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయని కలెక్టర్‌కు వివరించారు. పిచ్చాటూరు ప్రభుత్వ సంక్షేమ బీసీ బాలికల హాస్టల్ భవనం, రోడ్డు దుస్థితితో పాటు విద్యార్థులకు దుప్పట్లు, ప్లేట్లు, గ్లాసులు పంపిణీ గురించి కలెక్టర్‌కు క్షుణ్ణంగా తెలిపా రు.సానుకూ లంగా స్పందించిన కలెక్టర్ రోడ్లు, వంతెనలు మరమ్మతు లకు నిధులు మంజూరుకు కృషి చేస్తానని తెలిపారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. బీసీ బాలికల హాస్టల్ విద్యార్థినులకు దుప్పట్లు పంపిణీకి కలెక్టర్ అంగీక రించారని, హాస్టల్ భవనం, రోడ్డుకు ప్రతిపాదన పంపితే నిధులు మంజూరు చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారని ఎమ్మెల్యే వివరించారు. అనంతరం జాయింట్ కలెక్టర్‌ను కలిసి సమస్యలు వివరించారు. అనంతరం కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లకు ఎమ్మెల్యే శాలువా కప్పి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

న్యాయం గెలిచింది..

- కోర్టు తీర్పుతో కబ్జా భూమి డంపింగ్ యార్డ్‌కే సొంతం
- గ్రామస్తుల హర్షం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : గతంలో డంపింగ్ యార్డుగా వున్న ప్రభుత్వ పోరంబోకు స్థలం కబ్జాకు గురైంది. కోర్టు తీర్పుతో ఆ భూమి గ్రామస్తులకు దక్కింది. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. వడమాల పేట మండలం శ్రీ బొమ్మరాజు పురం గ్రామ పంచాయతీలో భారీ వర్షాల నేపథ్యంలో పంట భూములు ముంపునకు గురి కావడంతో 2015లో అప్పటి తహశీల్దారు కులశేఖర్ 216 సర్వే నెంబర్ గల ప్రభుత్వ పోరంబోకు భూమిని గుర్తించి డంపింగ్ యార్డ్‌కు కేటాయించారు. కానీ గత ఎనిమిది సంవత్సరాలుగా ఈ భూమి కబ్జాదారుడు సూర్యనారాయణ రాజు చేతిలో చిక్కుకుంది. గత ప్రభుత్వాల పాలనలో స్థానిక ఎమ్మెల్యే , కలెక్టర్, తహశీల్దారు, అధికారులకు పలు అర్జీలు సమర్పించి వారి చుట్టూ గ్రామస్తులు ప్రదక్షిణలు చేసినా ఫలితం శూన్యంగా మారిందని, భూ కబ్జాదారునికే వత్తాసు పలికారన్నారు. దీంతో గ్రామస్తులు న్యాయ స్థానాలను ఆశ్రయించగా, రెవెన్యూ 216 సర్వే నెంబర్ గల 9 ఎకరాల 40 సెంట్ల భూమిలో 2 ఎకరాల ప్రభుత్వ రెవెన్యూ పోరంబోకు భూమిని డంపింగ్ యార్డుకు, 31 సెంట్ల భూమిని దళిత ఆది ఆంధ్రవాడ శ్మశాన వాటికకు, 11 సెంట్ల భూమిని యానాది ఇళ్ల స్థలాలకు ఆ భూమి చెందేలా న్యాయస్థానం తీర్పు ఇవ్వడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల గ్రామ రెవెన్యూ సదస్సులో ప్రస్తుత తహశీల్దారుకూ కోర్టు ఆర్డర్ పేపర్లను సమర్పించడంతో గ్రామ సచివాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మండల గ్రామ సంబంధిత అధికారులు, పోలీస్ బందోబస్తు మధ్య ఆ భూమిని సర్వే చేసి, గ్రామానికి చెందేలా చేశారు. అనంతరం పోరంబోకు భూముల్లో ఉన్న పిచ్చికారి మొక్కలను, ముళ్ల పొదలను, మామిడి చెట్లను తొలగించి భూమిని చదును చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, గ్రామ సర్పంచ్ మణిరాజు, వడమాల పేట ఎస్ఐ, సిబ్బంది, మండల సర్వేయర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



కోర్టు తీర్పు పత్రాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లపై అదనపు ఈవో సమీక్ష

ప్రజాశక్తి -తిరుమల: తిరుమలలో జనవరి 10 నుండి 19వ తేదీ వరకు జరిగే పది రోజుల వైకుంఠ ద్వార దర్శనాల సందర్భంగా ట్రాఫిక్ నిర్వహణ ఏర్పాట్లపై టీటీడీ అదనపు ఈవో సి. హెచ్.వెంకయ్య చౌదరి సీవీఎస్వో శ్రీధర్, తిరుపతి జిల్లా ఎస్పి సుబ్బరాయుడుతో కలిసి సోమవారం సాయంత్రం తిరుమలలోని అన్నమయ్య భవనంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు ఈవో టీటీడీ అధికారులు, పోలీసులకు వైకుంఠ ద్వార దర్శన రోజుల్లో ట్రాఫిక్ నిర్వహణ ఏర్పాట్లపై దిశా నిర్దేశం చేశారు. ముఖ్యంగా వైకుంఠ ఏకాదశి, వైకుంఠ ద్వాదశి రోజుల్లో పోలీసుల సమన్వయంతో వాహనాల రాకపోకలు సజావుగా ఉండేలా చర్యలు చేపట్టి తిరుమలలో ప్రత్యేక పార్కింగ్ లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దర్శన టోకెన్లు, టికెట్లు ఉన్న భక్తులకు మాత్రమే దర్శనాలు ఉంటాయని అవగాహన కల్పించేందుకు రేడియో, బ్రాడ్‌కాస్టింగ్, సోషల్ మీడియా, ప్రెస్ కాన్ఫరెన్సులు, ఎస్వీబీసీ ప్రోమోలు, సూచిక బోర్డుల ద్వారా ప్రజలకు విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. ఆ పది రోజుల్లో దర్శనం కోసం ఎక్కువ సేపు వేచి ఉండే సమయాన్ని నివారించేందుకు టోకెన్లు లేదా టికెట్ల పైన ఉన్న నిర్దేశిత తేదీ–సమయం ప్రకారం మాత్రమే భక్తులను దర్శనాలకు అనుమతిస్తామని ఆయన తెలిపారు. వాహనాల రద్దీని నివారించడానికి పార్కింగ్ స్లాట్‌లను వికేంద్రీకరించాలని, దాదాపు 13,000 వాహనాల కోసం కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. గరుడ సేవ తరహాలోనే రామ్ భగీచా వద్ద ఎక్కువ సంఖ్యలో బగ్గీలను ఏర్పాటు చేయాలని సూచించారు. వైకుంఠ ఏకాదశి రోజున సరైన భద్రతా ఏర్పాట్లు ఉండేలా చూడాలని, స్థానిక పోలీసులతో పాటు ఆక్టోపస్ టీమ్ సేవలను కూడా ఉపయోగించుకోవాలని టీటీడీ భద్రతా అధికారులను ఆయన ఆదేశించారు.ఈ కార్యక్రమంలో టీటీడీ సీఈ సత్యనారాయణ, ఇతర టీటీడీ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న టిటిడి అదనపు ఈవో వెంకయ్య చౌదరి

విద్యార్థుల మానసికోల్లాసానికి క్రీడలు అవసరం

ప్రజాశక్తి - క్యాంపస్ : విద్యార్థుల మానసికోల్లాసానికి క్రీడలు అవసరమని విసి ఆచార్య రాణీ సదాశివమూర్తి పేర్కొన్నారు. యుజిసి ఆదేశానుసారం ఫిట్ ఇండియా వీక్ ఫెస్టివల్ కార్యక్రమంలో భాగంగా వేద విశ్వవిద్యాలయంలో డిసెంబర్ 22 నుండి 30 డిసెంబర్ వరకు వారం రోజులపాటు విద్యార్థులకు క్రీడలు నిర్వహించారు. యోగా ,కబడ్డీ ,వాలీబాల్, షటిల్ ,బ్యాడ్మింటన్ తో పాటు ఇండోర్ క్రీడలు కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ శారీరక వికాసంతో పాటు మానసిక వికాసం, భౌతిక వికాసం, విద్యా వికాసం, ఆధ్యాత్మిక వికాసం వంటి ఐదు వికాసాలు విద్యార్థులకు అవసరం అని, ముఖ్యంగా ఆటల ద్వారా విద్యార్థులకు మానసిక ప్రశాంతత, ఆరోగ్యం, ఉల్లాసం కలుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య రాధాగోవింద త్రిపాఠి, సంచాలకులు భారత శేఖరాచార్యులు, పి నీలకంఠం, ఎస్.ఎస్ మూర్తి ,మోహిత్ చంద్ర పరాగి, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి -రామచంద్రాపురం : మహిళల ఆర్థిక స్వావలంబనే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే సతీమణి పులివర్తి సుధారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మిట్టూరు కమ్యూనిటీ హాలులో మండల మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక టిడిపి నాయకులు ఎం తిరుమలరెడ్డి, మాధవి రెడ్డి, చేకూరి జనార్ధన్ చౌదరి, కోరా హరి ప్రసాద్ మండల మహిళా సమాఖ్య లీడర్లు ఆమెకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఆర్థిక సంక్షేమ పథకాలపై అవగాహన పెంచుకుని సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. డ్వాక్రా సంఘాల సభ్యులకు ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా రుణాలను మంజూరు చేస్తోందని, ఎస్సీ, ఎస్టీల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ఉచిత రుణాలను సద్వినియోగం చేసు కోవాలన్నారు. సైబర్ నేరాలపై అప్ర మత్తంగా ఉండా లని, మహిళలు, బాలికలను వేధిస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు. జనవరి 3వ తేదీ మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకో వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఇందిరా, తహశీల్దారు కే వెంకటరమణ, ఏటీఎం గురుమూర్తి, సీసీలు సుధాకర్, పార్వతి, టిడిపి నాయకులు కే మధుసూదన్ రెడ్డి, లెక్కల సురేంద్ర నాయుడు, నీటి సంఘం అధ్యక్షుడు కే అర్జున్ నాయుడు, రావిళ్ల గిరిబాబు, సుగుణ, సంఘమిత్రలు, గ్రామ సమాఖ్య లీడర్లు, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీమణి పులివర్తి సుధారెడ్డి

కార్మికుల క్షేమానికే బస్ షెల్టర్ : కట్ట సుధాకర్ రెడ్డి

ప్రజాశక్తి-నాయుడుపేట: కార్మికుల క్షేమాన్ని దృష్టిలో వుంచుకుని బస్ షెల్టర్‌ను ఏర్పాటు చేశామని కెఎస్ ఆర్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత కట్టా సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. కట్టా సుధాకర్ రెడ్డి తన తండ్రి కట్టా రామచంద్రారెడ్డి జ్ఞాపకార్థం నాయుడుపేట పట్టణంలోని గాంధీ పార్కు వద్ద సుమారు పది లక్షల రూపాయలు సొంత నిధులతో కట్టా రామచంద్రారెడ్డి, ఆయన సతీమణి నాయుడుపేట జడ్పిటిసి కట్టా జ్యోతి రెడ్డి సహకారంతో ప్రయాణికుల వసతి సముదాయం (బస్ షెల్టర్)ను నాయుడుపేట రోటరీ క్లబ్ సహకారంతో నిర్మించారు. జనవరి 4వ తేదీ సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ బస్సు షెల్టర్‌ను ప్రారంభించ నున్నారు. సోమవారం కట్టా సుధాకర్ రెడ్డి ఈ షెల్టర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయుడుపేట నుండి మేనకూరు మీదుగా వెంకటగిరికి వెళ్లే ప్రయాణికులు గతంలో ఎండ వానల కు ఇబ్బంది పడేవార న్నారు. వంద లాది మంది కార్మికులు నాయుడు పేట నుంచి మేనకూరు లోని సెజ్‌కు వెళుతుం టారని వారం దరికీ ఈ బస్ షెల్టర్ ఉప యోగకరం గా ఉంటుం దన్నారు. తన తండ్రి కట్టా రామ చంద్రారెడ్డి జ్ఞాపకార్థం బస్సు షెల్టర్‌ను ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అయనతో పాటు ఎస్‌కెరఫీ, నరేంద్ర పాల్గొన్నారు.



ప్రారంభానికి సిద్ధంగా వున్న బస్ షెల్టర్‌ను పరిశీలిస్తున్న కట్టా సుధాకర్‌రెడ్డి

విద్యార్థినులకు నేషనల్ పాలసీపై అవగాహన

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం సోషల్ వర్క్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం ఎమ్ఎస్‌డబ్ల్యూ విద్యార్థినులకు 'నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ – 2020 సోషల్ వర్క్– ప్రాధాన్యత' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. విక్రమ సింహపురి యూనివర్సిటీ ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ డా. కె .సునీత నూతన విద్యావిధానం అవసరం, అవకాశాలు, ఉపాధి కోర్సులు గురించి వివరిం చారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి డా. తులసి తవిత, లలిత కుమారి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న విక్రమ సింహపురి యూనివర్సిటీ రిజిస్ట్రారు కె సునీత

క్రైం న్యూస్

ఏడు కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పట్టణంలోని ఏరియా ఆసుపత్రికి వెళ్లే దారిలో సోమవారం రాత్రి ఇద్దరు గంజాయి విక్రేతరులను టూ టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి ఏడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుపడ్డ వారు ఒడిస్సా రాష్ట్రానికి చెందిన బిజయ్ డోలాబెహరా(29), సుక్కు మండల్(25)గా గుర్తించారు. వీరు ఒడిస్సా నుంచి చెన్నై మీదుగా కేరళకు గంజాయికి తరలిస్తునట్లుగా విచారణలో తేలిందని టూ టౌన్ సీఐ వెంకటేశులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

శ్మశానానికి దారి సౌకర్యం కల్పించండి

రెవెన్యూ సదస్సులో తహశీల్దారుకు గ్రామస్తుల వినతి



తహశీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న ప్రజలు

ప్రజాశక్తి - సత్యవేడు: సత్యవేడు మండలంలోని జడేరి ఎస్‌సి కాలనీ శ్మశానానికి దారి సౌకర్యం కల్పించాలని ఆ కాలనీ వాసులు పలువురు రెవెన్యూ అధికారులకు విన్నవించారు. సోమవా రం మండల పరిధిలోని కన్నవరం ప్రాథమికోన్నత పాఠశాల ప్రాంగణంలో గ్రామ సర్పంచులు బుజ్జమ్మ బాబు, జయంతి అధ్యక్షతన తహశీల్దారు సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిడిపి మండల అధ్యక్షులు ప్రవీణ్ కుమార్ రెడ్డి, మాజీ మండలాధ్యక్షుడు పరమశివం హాజరయ్యారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ అధికారులకు ప్రజల నుంచి భూ సమస్యలపై ఎస్‌సి కాలనీ శ్మశానానికి దారి సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని సర్పంచ్ బుజ్జమ్మ బాబు ఆధ్వర్యంలో కాలనీ వాసులు తహశీల్దారు సుబ్రహ్మణ్యంకు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఆర్ఐ సురేష్, మండల సర్వేయర్ చంద్రశేఖర్, వీఆర్వో శేఖర్, సచివాలయ విఆర్ఓ నాగార్జున, కలైవర్ణ, సర్వేయర్ రజిని, షణ్ముగం, డేటా ఎంట్రీ ఆపరేటర్ చంద్ర, స్థానిక టిడిపి నాయకులు ధనశేఖర్ పాల్గొన్నారు.

సర్టిఫికెట్లు ఇప్పించాలి

కలెక్టర్‌కు విద్యార్థిని వినతి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి నగర పరిధిలోని ఎస్విహెచ్ఆర్ కళాశాలలో 2020–21లో తాను డిగ్రీలో చేరానని, కరోనా కారణంగా ఆరోగ్య సమస్యలతో కళాశాలకు సక్రమంగా వెళ్లలేదని, ఈ క్రమంలో ప్రభుత్వం విడుదల చేసిన కానిస్టేబుల్ రిక్రూట్మెంట్ కు దరఖాస్తు చేసుకున్నానని, ఎస్విహెచ్ఆర్ కళాశాల వారు పూర్తి ఫీజు చెల్లించాలని, లేని పక్షంలో సర్టిఫికెట్లు ఇచ్చేది లేదని బెదిరిస్తున్నారని కలెక్టర్ వెంకటేశ్వర్‌కు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో విద్యార్థిని మూడే అమరావతి వినతిపత్రం అందించారు. పదో తరగతి, ఇంటర్ సర్టిఫికెట్లను జనవరి 3న నిర్వహించే కానిస్టేబుల్స్ దేహదారుఢ్య పరీక్షల హాజరులో అధికారులకు ఇవ్వాలని, ఈ సమయంలో సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఎస్విహెచ్ఆర్ కళాశాల యాజమాన్యం తన జీవితంతో ఆటలాడుకుంటోందని కలెక్టర్ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. దీన్ని వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఎస్వీయూ రిజిస్ట్రారు భూపతి నాయుడుకు రెఫర్ చేశారు. భూపతి నాయుడు కలెక్టర్ ఆదేశాల మేరకు త్వరతగతిన సర్టిఫికెట్లు మంజూరు చేయాలని కళాశాలకు రెఫర్ చేశారు. అమరావతికి న్యాయం చేయాలని విద్యార్థి సంఘం నాయకులు కళాశాల యాజమాన్యాన్ని కోరగా దురుసుగా ప్రవర్తించాలని వాపోయారు.

స్కేటింగ్‌లో అట్లాంటిస్ విద్యార్థుల రికార్డు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి–కరకంబాడి మార్గం లోని అట్లాంటిస్ పాఠశాల విద్యార్థులు స్కేటింగ్‌లో రికార్డు సృష్టించారని పాఠశాల అధినేత కెఎస్ వాసు తెలిపారు. ఈ నెల 28, 29న తిరుపతిలోని శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో ఆంధ్రప్రదేశ్ స్పీడ్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్కేటింగ్ పోటీలలో 2వ తరగతి చదువుతున్న శ్రీచరణ్ తేజ రెడ్డి జిల్లా , రాష్ట్ర స్థాయిలో రెండేసి బంగారు పతకాలు సాధించడమే కాక రిలే రేస్‌లో రజిత పతకాన్ని సాధించి జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీలకు ఎంపికయ్యాడని, 4వ తరగతి చదువుతున్న కీర్తన 200 మీటర్లు, 400 మీటర్లు, 1000 మీటర్ల స్కేటింగ్ రేస్‌లో మొదటి బహుమతి, బంగారు పతకాలను సాధించించారన్నారు. రిలే రేస్‌లో 2వ స్థానంలో రజితం సాధించి జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీలకు ఎంపికయ్యారన్నారు. తమ పాఠశాల పిల్లలు జాతీయ స్థాయిలో స్కేటింగ్ పోటీలకు ఎంపిక కావడం గర్వకారణంగా వుందన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ కె.ఆర్ అనురాధ గోపాల్, ప్రమీల కృష్ణన్, వైస్ ప్రిన్సిపల్ మోహకర్ ప్రత్యేకంగా అభినందించారు.



ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

ఆరోగ్య సేవలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి: డిపిఓ

ప్రజాశక్తి -దొరవారిసత్రం : ప్రజలకు అందిస్తున్న ఆరోగ్య సేవలను సకాలంలో ఆయా పోర్టర్లలో నమోదు చేసి, నూరు శాతం లక్ష్యాలు సాధించాలని డిపిఓ ప్రకాష్ ఏఎన్ఎంలకు సూచించారు. సోమవారం దొరవారిసత్రం, తొగరాముడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో పనిచేస్తున్న ఏఎన్ఎంలకు తిరుపతి డిఎఫ్‌టి టీం సభ్యులు ఆర్‌సిహెచ్, అబా ఐడి, యూవిన్ పోర్టర్, తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు.ప్రతి ఏఎన్ఎం వారి పరిధిలో కేటాయించిన ఆరోగ్య సేవలను ప్రజలకు అందిస్తూ వాటిని ఆయా యాప్‌లలో, ఆన్‌లైనులో నూరు శాతం నమోదు చేయాలన్నారు. పర్సంటేజీ తక్కువ ఉన్న వారిని, దానికి సంబంధిత కారణాలను ఆరా తీశారు. ఇకపై అన్ని ఆరోగ్య లక్ష్యాలు90 శాతంకు తగ్గకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చైతన్య, సిహెచ్ఓ సంపూర్ణమ్మ, హెచ్‌వి మైథిలి, హెచ్ఎస్ గోపి కిరణ్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన


ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: ప్రకృతి వ్యవసాయంతో పండించిన పంటలను తింటే వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని ప్రకృతి వ్యవసాయ శాస్త్రవేత్త శంకర్, తెలంగాణలోని వనపర్తి జిల్లా వైద్యాధికారి జయచంద్రమోహన్ తెలిపారు. సోమవారం బుచ్చినాయుడుకండ్రిగలో సహజ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రసాయనిక ఎరువులతో పండించిన పంటల వలన వివిధ రోగాల బారిన పడుతున్నామన్నారు. అనంతరం పిల్లల ఎదుగుదలలో తల్లిదండ్రులు పాత్రపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యోగా గురువు సురేష్ నాయుడు, రైతులు పాల్గొన్నారు.

'పౌష్టికాహార నాణ్యతలో రాజీ వద్దు'

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: మధ్యాహ్న భోజనం పథకం ద్వారా విద్యార్థులకు అందజేస్తున్న పౌష్టికాహార నాణ్యతలో రాజీపడద్దని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి తల్లి బొజ్జల బృందమ్మ నిర్వాహకులకు సూచించారు. సోమవారం ఆమె పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను పరిశీలించారు. మౌలిక వసతులపై ఆరా తీశారు. మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. నాణ్యత పెంచాలని సూచించారు.

నర్సరీలతో రైతు కష్టాలు తీరేనా?

- రైతన్నకు తగ్గిన ప్రయాస కష్టం - విస్తరిస్తున్న నర్సరీలు - అదునులో పంటల సాగు



ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: పంటల సాగులో మార్పులొస్తున్నాయి. అందుబాటులో సాంకేతికత.. యాంత్రిక నైపుణ్యం కారణంగా వ్యవసాయంలో పెను మార్పులొచ్చాయి. మోడు వ్యవసాయం కాస్త స్మార్ట్ వ్యవసాయంగా మారుతోంది. ఇంటి వద్ద నుంచే విద్యుత్ మోటారు ఆన్, ఆఫ్ చేయొచ్చు. ఇంటి నుంచే వ్యవసాయ పను లను పర్యవేక్షించొచ్చు ఈ కోవలోనే నారుపోయి వాటి స్థానంలో నర్సరీలు పుట్టుకొచ్చాయి. అవ సరం మేరకు పంట నారును సరఫరా చేసే నర్సరీలతో రైతులకు బహు ముఖ ప్రయోజనాలు దక్కు తున్నాయి. బుచ్చినాయు డుకండ్రిగ మండలంలో రైతులు వంకాయ, మిర ప పంటల సాగు విస్త తంగా చేస్తారు. ఒక ప్పుడు మిరప, వంకాయతో పాటు పంటల సాగు కావాలంటే రైతులు ఎంతో శ్రమించాల్సి వచ్చేది. మిరప, వంకాయ సాగు కోసం పొలాల్లోనే నారుకు విత్తనం చల్లి నారు సిద్ధం చేస్తున్నారు.

సమయం ఆదా

వాతావరణ పరిస్థితులు ఎప్పుడు ఎలా ఉంటాయో అంచనా వేయటం కష్టమవుతోంది. అందువల్ల ముందస్తుగా పొలంలో నారు పోసుకుంటే అవి మొక్కలయ్యే సరికి వర్షాలు వస్తాయో, రావో తెలియదు. వర్షాలు ఆలస్యమైతే నారు ముదిరిపోతుంది. అందువల్ల నర్సరీల్లో అయితే మనకు ఎప్పుడు అవసరమో అప్పుడే నారు కొనుగోలు చేసి పంటసాగు చేయొచ్చు. దీనివల్ల పెట్టుబడి వ్యయం పెరిగినా సమయం కలిసొస్తుంది. అదునులో పంట సాగు చేయవచ్చని రైతులు పేర్కొంటున్నారు. నర్సరీలో పెరుగుతున్న వివిధ రకాల నారు మొక్కలయ్యాక పొలంలో నాటుకునే వారు. ఈ ఏర్పాట్లు జరిగేందుకు నేల రోజు లు పట్టేది. కొంత మందికి నీటి కొరత, మరి కొం త మందికి విద్యుత్ సమస్య ఉండేది. నారు పెంచేందుకు ఎంతో వ్యయ ప్రయాసాల కోర్చాల్సి వచ్చేది. అయితే రైతుల్లో కూరగాయలు, వాణిజ్య పంటల సాగుపై మక్కువ పెరగటం, మంచి ధరలు మార్కెట్లో లభిస్తుండటంతో పంట సాగు విస్తీర్ణం ఏటా పెరుగుతూ వస్తోంది. పంట కోత సమయం తగ్గా లనే ఉద్దేశంతో నర్సరీలను ఆశ్రయిస్తుండటంతో మండల కేంద్రంలో నర్సరీలు అనేకం పుట్టుకొ స్తూనే ఉన్నాయి.

మార్కెట్ ధరలకు అనుగుణంగా

నర్సరీలో మొక్కల విక్రయాలు ఎప్పుడూ ఒకేలా ఉండవు. మిర్చి, వంగ, టమాట, ధరలు మార్కెట్లో బాగుంటే రైతులు ఎక్కువ ధరకైనా నారు కొంటారు. అదే మార్కెట్లో ధరలు పడిపోతే పంట సాగు చేసే వారి సంఖ్య తగ్గిపోయి మేము కూడా నష్టపోవాల్సి వస్తుంది. మిరప, వంకాయ, టమాట నారు అం దుబాటులో ఉంచుతున్నాం. వాతావరణం, మార్కెట్ ధరలపై నర్సరీల భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది అని రైతులు పేర్కొంటున్నారు.

నూతన సంవత్సరం వేడుకలకు కల్యాణ వెంకన్న ఆలయం ముస్తాబు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: నూతన ఆంగ్ల సంవత్సరంను పురస్కరించుకుని తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. కొత్త సంవత్సరం రోజున ఆలయానికి భక్తులు భారీగా చేరుకోనున్నారు. విశేష పుష్పాలంకరణ, పచ్చని తోరణాలతో ఆలయం సరి కొత్త శోభను సంతరించుకుంది. ఆలయ పరిసరాలతో పాటు గ్రామ శివార్ల నుంచి రంగు, రంగుల విద్యుత్ దీపాలు, స్వాగత తోరణాలతో అందంగా ముస్తాబైంది. ప్రతి ఏటా కొత్త ఏడాదిని పురస్కరించుకుని కల్యాణ వెంకన్న దర్శనార్థం వేలాది మంది భక్తులు తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల నుంచే కాకుండా ఉమ్మడి చిత్తూరు జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తుంటారు. వీరందరికీ స్వామి వారి దర్శనంతో పాటు తీర్థ ప్రసాదాలు అందించేలా ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఏర్పాట్లు చేస్తారు. ఈ ఏడాది కూడా భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందించడంతో పాటు ఆలయం వద్ద దర్శనానికి ఎక్కువ సమయం పట్టకుండా ప్రత్యేక క్యూలైన్ల ద్వారా భక్తులు అందరికీ స్వామి దర్శనం కలిగేలా చర్యలు తీసుకున్నారు. ప్రధాన ఆలయం వద్ద భక్తుల మధ్యన తోపులాట, తొక్కిసలాట చోటు చేసుకోకుండా పటిష్టమైన బ్యారికేడ్లను ఏర్పాటు చేయడంతో పాటు భద్రతా సిబ్బందిని కూడా అందుబాటులోకి తీసుకువచ్చారు. కొత్త ఏడాది ప్రారంభం తరువాత పది రోజులకే వైకుంఠ ఏకాదశి పర్వదినం వస్తున్నందున ఆలయం వద్ద చేపట్టిన అలంకరణలు ఆ పది రోజులు భక్తులకు కనువిందు చేయనున్నాయి.

ప్రత్యేకంగా పార్కింగ్ స్థలాలు ఏర్పాటు

తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి దర్శనార్థం వచ్చే భక్తులు తమ వాహనాలను గ్రామంలోని ప్రధాన రహదారుల్లో పార్కింగ్ చేయడం వల్ల భక్తులకు ఇబ్బందికరంగా ఉంటుందని, గ్రామ శివార్లలోనే పార్క్ చేసుకునేలా పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయించారు. పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారి నుంచి తుమ్మలగుంట గ్రామంలోకి వచ్చే వాహనాలు అన్నీ కేవీఎస్ స్పోర్ట్స్ పార్క్‌కు ఎదురుగా వున్న మఠం భూముల్లో పార్క్ చేయాలని, తిరుపతి నగరం నుంచి వచ్చే వాహనాలు డెయిరీ ఫాం వద్ద పార్క్ చేయాలని, పేరూరు, విద్యానగర్ మీదుగా వచ్చే వాహనాలు నలందానగర్, చెంచులక్ష్మి కాలనీ పరిసరాల్లో పార్క్ చేసుకోవాలని ఆలయ సిబ్బంది సూచించారు.



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

ఆలయాల హుండీ లెక్కింపు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :

పట్టణంలోని కామాక్షి సమేత సదాశివేశ్వరాలయం, ఆరేటమ్మ ఆలయాల హుండీ ఆదాయం లెక్కించామని ఆలయ ఈవో పి జయకృష్ణ తెలిపారు. సదాశివేశ్వరాలయంలో ఆరు నెలలకు రూ.2,86,041 ఆదాయం వచ్చిందని, ఆరేటమ్మ ఆలయంలో 8 నెలల తర్వాత లెక్కించారని 1,20,161 రూపాయలు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ హుండీల ద్వారా వచ్చిన ఆదాయాన్ని బ్యాంకులో జమచేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గాలి జీవరత్నం నాయుడు, ఎన్ విక్కీ రాయల్, జి బాబు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సుమనప్రియ, ఆలయ ఈవో పి జయకృష్ణ, ఆలయ అర్చకులు మురళీధర్ గురుకుల్, పోలీస్ సిబ్బంది జె బాలకృష్ణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

జోరుగా టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి :

పట్టణంలో టీడీపీ సభ్యత్వ నమోదు సోమవారం నిర్వహించారు. సభ్యత్వం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ 13 వ యూనిట్ ఇన్‌ఛార్జి నెమళ్ళూరు బుజ్జి, మిన్నల్ రవి, డాక్టరు యం ఉమేష్ రావు పాల్గొన్నారు.

వీధి వ్యాపారులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:

కూరగాయల మార్కెట్ ప్రాంతంలో వీధి వ్యాపారాలు చేసుకునే వారికి న్యాయం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి కోరారు. సోమవారం ఆయన వీధి వ్యాపారుల పక్షాన ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మురళీ మాట్లాడుతూ మార్కెట్ ప్రాంతంలో వీధి వ్యాపారాలు చేసుకుంటున్న 30 మందిని మున్సిపల్ అధికారులు అన్యాయంగా వెళ్లగొట్టారని, బాధితులు కోర్టుకెళ్లగా ప్రత్యామ్నాయ స్థలాలు చూపాలని మున్సిపల్ అధికారులను కోర్టు ఆదేశించిందని, ఆ మేరకు ఏరియా ఆస్పత్రికి వెళ్లేదారిలో ఉన్న అన్న క్యాంటీన్‌కు సమీపంలో వీధి వ్యాపారులకు ప్రత్యామ్నాయ స్థలాలు చూపుతామని మున్సిపల్ అధికారులు హామీ ఇచ్చారని, రోజులు గడుస్తున్నా వారికి న్యాయం చేయలేదని వెంటనే న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య పాల్గొన్నారు.

వామపక్షాలకు మద్దతు

టిఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంటు అధ్యక్షులు కొట్టే హేమంత్ రాయల్



ప్రజాశక్తి - క్యాంపస్ : వామపక్ష ప్రజ సంఘాలకు, పార్టీలకు వారు చేసే ప్రజా పోరాటాలకు తాము ఎల్లప్పుడూ మద్దతుగా ఉంటామని టిఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు కొట్టే హేమంత్ రాయల్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చింది ఆరు నెలల అయ్యిందని, గతం వైసిపి ప్రభుత్వం జీఓ నెంబరు 77, ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్‌షిప్ విద్యార్థులకు చెల్లించకుండా విద్యార్థులను మోసం చేసి లక్షల కోట్ల రూపాయల అప్పులు చేసి ఇప్పుడు ప్రభుత్వంపై నిందలు మోపడం దారుణమని వారు మండిపడ్డారు. వామపక్ష ప్రజాసంఘాలకు ఇప్పటి నుంచే కాదు.. చంద్రబాబు ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి వామ పక్షాలకు ఎప్పుడూ తోడుగా ఉంటూ వారి సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొని వస్తే వెంటనే పరిష్కరిసా రన్నారు. కానీ ఈ రోజు విద్యార్థులకు భారంగా మారిన ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్‌షిప్ జీవో నెంబర్ 77 అనేక రకమైన విద్యారంగ సమస్యలకు కారణమైన వైసిపి దాని అనుబంధ విద్యార్థి విభాగంతో కలిసి కార్యక్రమాలు దారుణమన్నారు. వైసిపి, దాని అనుబంధ విద్యార్థి విభాగం గత ప్రభుత్వంలో ఏ రోజు బయటికి వచ్చి జీవో నెం. 77 ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్‌షిప్‌లు కనీసం ఒక్క మాట కూడా మాట్లాడలేదని వారికి విద్యార్థి సమస్యలపై మాట్లాడే హక్కు లేదని విమర్శించారు.

రాష్ట్రస్థాయి సంస్కృత శాస్త్రీయ, శలాకా పోటీల ప్రారంభం

ప్రజాశక్తి - క్యాంపస్ : జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం సోమవారం చెలికాని అన్నారావు సభాభవనంలో రాష్ట్ర స్థాయి వక్తృత్వ, శలాకా పోటీల ప్రారంభోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ముఖ్య అతిథు లు కాంచీపురం చంద్రశేఖరేంద్ర సరస్వతీ విశ్వమహా విద్యాల య ఉప కులపతి ప్రొ.జి.శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి నిమిషాన్ని మనజ్ఞానవికాసానికి వినియోగించుకోవాలో విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు.

'సూర్య' విద్యుత్‌తో బిల్లులు ఆదా : ఇఇ

ప్రజాశక్తి - తిరుపతి సిటి

ప్రతి ఒక్కరూ ఇంటి పై సోలార్ టాప్ ను నిర్వహించుకుని విద్యుత్ బిల్లులను ఆదా చేసుకోవాలని ఎస్‌పిడిసిఎల్ ఇఇ విన్నకోటి చంద్రశేఖర్‌రావు సూచించారు. సోమవారం టౌన్ డివిజన్ విద్యుత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కాంట్రాక్టర్ల సమావేశం లో ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులు రాయితీతో ప్రతి ఇంటి పై సోలార్ టాప్ ను నిర్వహించు కుని విద్యుత్ బిల్లులను ఆదా చేసుకోవాలని సూచించారు.

పెండింగ్ ఫీజు రీయింబర్సుమెంటు, వసతి దీవెన డబ్బులు విడుదల చేయాలి

ప్రజాశక్తి - క్యాంపస్ : రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ, ఇంజనీరింగ్, మెడికల్, పీజీ చదువుతున్న విద్యార్థులకు పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్సుమెంట్, వసతి దీవెన డబ్బులు వెంటనే విడుదల చేయాలని కోరుతూ సోమవారం తిరుపతి అన్నమయ్య సర్కిల్ వద్ద వందలాదిమంది విద్యార్థులతో విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో సోమవారం మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండి చలపతి, వైయస్సార్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు ఓబుల్ రెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర గర్ల్స్ కో కన్వీనర్ చిన్నం ప్రీతి, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి మల్లికార్జున, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు రామకృష్ణ, వైయస్సార్ యూత్ వింగ్ జిల్లా నాయకులు మోహన్ రెడ్డి, పిడిఎస్ఓ జిల్లా కార్యదర్శి ఆశ, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఉదయ కుమార్, ప్రవీణ్ కుమార్ , ఓబిసి నాయకులు తిరుమలేష్, జిఎన్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు శివశంకర్ నాయక్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ ఇంజనీరింగ్ పీజీ చదువుతున్న విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ వసతి దీవెన ప్రభుత్వం నుంచి అందక కోర్సు పూర్తి చేసుకున్న ఉద్యోగాలకు వెళుతున్నా సర్టిఫికెట్లు లేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితి రాష్ట్రంలో ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 3,580 కోట్లు ఫీజు రీయింబర్సుమెంటు, వసతి దీవెన బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కోర్స్ పూర్తిచేసుకున్నా పై చదువులకు వెళ్లలేక, ఉద్యోగాలకు వెళ్లలేక విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటు న్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అక్టోబర్ నెలలో విద్యాశాఖ మంత్రి లోకేష్ తమ ప్రభుత్వం ఫీజు రీయింబర్సుమెంటు, వసతి దీవెన బకాయిలు చెల్లిస్తామని ప్రకటన ఇచ్చినా విద్యాసంస్థల యాజమాన్యులు ఆ ప్రకటనలు ఏమాత్రం లెక్కచేయకుండా ప్రభుత్వం నుంచి తమకు స్పష్టమైన హామీ వస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని ఇప్పటివరకు ఎలాంటి హామీ రాలేదని, మీరు డబ్బులు చెల్లించి మీ సర్టిఫికెట్లు తీసుకెళ్లాలని విద్యార్థుల పై ఒత్తిడి చేస్తున్నారన్నారు. కోర్స్ పూర్తి చేసుకుని ఉద్యోగం వచ్చినప్పటికీ సర్టిఫికెట్లు లేక చేతికి వచ్చిన ఉద్యోగం వెళ్లిపోయిందని బాధతో ఈ రాష్ట్రంలో నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకోవాల్సి వస్తోందన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి విద్యార్థుల కష్టాలు తీర్చి 3,580 కోట్ల బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉన్నత చదువులకు శాపంగా మారిన జీవో నెంబర్ 77ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు .ఎన్నికలలో యువగళం పాదయాత్రలో నారా లోకేష్ మేము అధికారంలోకొస్తే జీవో నెంబర్ 77 రద్దు చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ అధికారంలోకి వచ్చి 8 నెలల గడుస్తా ఉన్నప్పటికీ విద్యా సంవత్సరం కూడా ప్రారంభమైన నేటికీ జీవో నెంబర్ 77 పైన ప్రభుత్వం ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులను సమీకరించి చలో సీఎం కార్యాలయం ముట్టడికి పిలుపునిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి,యువజన సంఘాల నాయకులు చంద్ర నాయక్, బాలసుబ్రమణ్యం ,మోహన్, సూర్య రెడ్డి, హరినాథ్ రెడ్డి, ప్రకాష్ రెడ్డి, శ్రీను, సురేష్ ,రెడ్డి మోహన్ ,రవితేజ ,పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నాయకులు